

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.




Contact Number 9059328777



రంగారెడ్డి | మంగళవారం 31-03-2026 | సంపుటి: 01 | సంచిక : 284 | వేల: 2 రూ | పేజీలు :08 | సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy | Tuesday 31-03-2026 | Volume :01 | Issue: 284 | Cost: 2 | Pages:08 | Editor : Katta HimaPavani


- ఇంట్రాడేలో ఒక దశలో రూ.95.22 స్థాయికి
- చివరికి 15 పైసల లాభంతో రూ.94.70 వద్ద ముగింపు
- పశ్చిమాసియా యుద్ధంతో 4.1 శాతం నష్టపోయిన రూపాయి
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో 10 శాతం పతనం
- 14 ఏళ్లలో ఇదే అతిపెద్ద వార్షిక క్షీణత

# డాలర్ =రూ.95

## -సరికొత్త ఆల్‌టైమ్ కనిష్టానికి భారత కరెన్సీ



**ముంబై మార్చి 30 నేటి దర్శిని,**


భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి జారుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం ఒక దశలో రూ.95.22 వద్దకు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.95 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 115 డాలర్లకు ఎగబాకడంతో పాటు డాలర్ బలపడటం, మన ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు ఇందుకు ప్రధాన కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. ముడి చమురు ధరలు దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగితే డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.100 దిశగా పయనించనుందని వారన్నారు.

-మిగతా 2 లో

## ఆహార కల్తీ నియంత్రణ

# సరికొత్త వ్యవస్థ

### ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన



- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 30 నేటి దర్శిని,**

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన

-మిగతా 2 లో




# రాయల్స్ రాజసం

- సమిష్టిగా రాణించిన రాజస్తాన్
- సూర్యవంశీ 15బంతుల్లోనే అర్ధసెంచరీ
- చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు

**గౌహతి మార్చి 30 నేటి దర్శిని,**

ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) ప్రారంభ మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ సమిష్టిగా మెరిసింది. తొలుత బౌలింగ్‌లో బర్గర్, ఆర్చర్, రవీంద్ర జడేజా రాణించడంతో చెన్నై సూపర్ కింగ్స్(సిఎస్‌కె) 127పరుగులకే పరిమితం చేసిన రాజస్తాన్ రాయల్స్.. అనంతరం సూర్యవంశీ 15బంతుల్లోనే అర్ధసెంచరీతో రాణించడంతో ఆ లక్ష్యాన్ని 12.1ఓవర్లలోనే సునాయాసంగా ఛేదించింది. మ్యాచ్ ప్రారంభానికి ముందు వర్షం కురవడం, టాస్ గెలవడం రాజస్తాన్‌కు కలిసొచ్చింది. టాస్ గెలిచిన రాజస్తాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ బౌలింగ్ ఎంచుకోగా... బౌలర్లు కెప్టెన్ నమ్మకాన్ని వమ్ము కానీయలేదు. చెన్నై బ్యాటర్లను క్రీజ్‌లో కుదురుకోనివ్వక...

-మిగతా 2 లో



## ఇరాన్ దిగిరాకపోతే

# స్మాష్ చేస్తాం

- త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి
- మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

**వాషింగ్టన్**

ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే,

-మిగతా 2 లో



# చైనా సీసీ కెమెరాల బ్యాన్

- బ్యాక్ డోర్ ఉంటుందన్న అనుమానం
- కొత్త నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం


**న్యూఢిల్లీ,**

చైనీస్ సీసీటీవీ కెమెరాలను నిషేధిస్తూ భారత్ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ భద్రత దృష్ట్యా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'మేడ్ ఇన్ చైనా' కెమెరాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించబోతోంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో హెక్ విషన్ , దాహువా, టీపీ-లింక్ వంటి చైనా కంపెనీల హవా నడుస్తోంది. అయితే.. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త సర్టిఫికేషన్ నిబంధనల ప్రకారం.. ఇంటర్నెట్‌తో అనుసంధాన మయ్యే ఈ చైనా కంపెనీల నిఘా పరికరాల అమ్మకాలను

-మిగతా 2 లో

# విజయ్ ఆస్తులు రూ 603 కోట్లు..

### ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి



**చెన్నై మార్చి 30 నేటి దర్శిని,**

టీవీకే చీఫ్ విజయ్ తనకు రూ.603 కోట్ల స్థిర,చరాస్తులు ఉన్నట్టు సోమవారం ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. తనకు రూ.404.58 కోట్ల చరాస్తులున్నాయని విజయ్ తెలిపారు. కొడైకెనాల్‌లోని వ్యవసాయ భూమి, చెన్నైవ్యాప్తంగా ఉన్న వాణిజ్య, నివాస భవనాలతో కూడిన చరాస్తుల

-మిగతా 2 లో

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- మంత్రి అక్రమాలపై స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలి
- అక్రమ మైనింగ్, భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలి
- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు..సాక్ష్యాధారాలు అందజేత



**హైదరాబాద్ మార్చి 30 నేటి దర్శిని,**

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఆయన అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సోమవారం హైదరాబాద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్, భూకబ్జాలపై సాక్ష్యాధారాలను అందజేసింది.

-మిగతా 2 లో

# ఏప్రిల్ 1 నుంచి జనగణన..

- మొదటి విడతలో గృహ గణన
- 33 ప్రశ్నలతో వివరాల సేకరణ
- తెలంగాణలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటి సర్వే
- ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు 'సెల్ఫ్-ఎన్యుమరేషన్'కు అవకాశం



**న్యూఢిల్లీ,**

దేశంలో జనగణనకు రంగం సిద్ధమైంది. తొలి విడత ప్రక్రియ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్నది. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా 33 ప్రశ్నలను అడుగుతారని కేంద్రం తెలిపింది. రెండో దశలో జనాభా లెక్కల్ని సేకరిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇది ప్రారంభం కానున్నది. జనగణన కోసం పౌరులు ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని కేంద్రం వెల్లడించింది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్జీఐ), జన గణన కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ, ' ఈసారి తొలిసారిగా పౌరులు 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ద్వారా స్వయంగా తమ సమాచారాన్ని నమోదు చేసుకోవచ్చు. ఇది ఇంటింటి సర్వే ప్రారంభానికి 15 రోజుల ముందు అందుబాటులో ఉంటుంది' అని తెలిపారు. భారత్‌లో నివసిస్తున్న పౌరులకు మాత్రమే 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' ఆప్షన్ వర్తిస్తుందని చెప్పారు. మరికొద్ది రోజుల్లో పలు రాష్ట్రాల్లో ఇంటింటి సర్వే ప్రారంభం

-మిగతా 2 లో

## నక్సల్స్ విముక్త

# భారత్!



### దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది

- 75 ఏండ్లు నక్సల్స్‌ను పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీనే
- అడవి బిడ్డలను అభివృద్ధికి దూరం చేసింది నక్సలైట్లే
- ఆయుధాలు చేత పట్టి పోరాడితే భారీ మూల్యం చెల్లించక తప్పదు
- లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సుదీర్ఘ ప్రకటన

**న్యూఢిల్లీ మార్చి 30 నేటి దర్శిని,**

దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని, మావోయిస్టు హింసాకాండకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి నక్సలిజాన్ని తుడిచిపెట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ సోమవారం లోక్‌సభలో అమిత్ షా 90

-మిగతా 2 లో



## పౌర స్వేచ్ఛను

# హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్ మార్చి 30 నేటి దర్శిని,**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన

-మిగతా 2 లో

# డాలర్ =రూ.95

మొదటి తరువాయి

ఆరంభంలో లాభాలు: క్రితం వారాంతంలో 89 పైసలు క్షీణించి రూ.94.85 వద్ద ముగిసిన డాలర్-రూపాయి మారకం విలువ.. సోమవారం ట్రేడింగ్‌లో రూ.93.62 వద్ద ప్రారంభమైంది. మరింత బలపడి రూ.93.57 వద్దకు చేరుకుంది. అంటే, గత శుక్రవారం ముగింపుతో పోలిస్తే 128 పైసలు బలపడింది. బ్యాంకుల అమెరికన్ కరెన్సీ ఓవర్‌నైట్ నెట్ ఓపెన్ పొజిషన్స్‌ను 10 కోట్ల డాలర్లకు తగ్గిస్తూ ఈ నెల 27న ఆర్‌బీఐ సర్క్యులర్ జారీ చేయడం ఇందుకు దోహదపడింది. అయితే, ఆర్‌బీఐ చర్య రూపాయిని ఎంతోసేపు ఆదుకోలేకపోయింది. కార్పొరేట్ సంస్థలు భారీగా డాలర్లను కొనుగోలు చేయడంతో మన కరెన్సీ మళ్లీ జారుకోవడం మొదలు పెట్టింది. ఒక దశలో ఎక్స్ఛేంజ్ రేటు రూ.95.22 వద్దకు చేరుకుంది. చివర్లో మళ్లీ తేరుకుంది. క్రితం క్లోజింగ్‌తో పోలిస్తే, 15 పైసల లాభంతో రూ.94.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూపాయి మారకం విలువ 165 పైసల శ్రేణిలో ఊగిసలాడింది. గత నెల 28న పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి రూపాయి మారకం విలువ 4.1 శాతం మేర క్షీణించింది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో 9.88 శాతం పతనమైంది. గత 14 ఏళ్లలో మన కరెన్సీకిదే అతిపెద్ద వార్షిక క్షీణత. అంతేకాదు, వర్ధమాన దేశాల్లోకెల్లా అత్యధికంగా నష్టపోయిన కరెన్సీ కూడా మనదే. 2011-12 ఆర్థిక సంవత్సరంలో డాలర్‌తో రూపీ మారకం విలువ 12.4 శాతం తగ్గింది.

# రాయల్స్ రాజసం

మొదటి తరువాయి

వరుసగా వికెట్ల పడగొట్టారు. దీంతో చెన్నై 19పరుగులకే 3వికెట్లు, ఆ తర్వాత 51 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ 12.1ఓవర్లలో కేవలం 2వికెట్లు కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. సూర్యవంశీ అర్ధసెంచరీకి తోడు.. జైస్వాల్(38నాటౌట్), జురెల్(18), కెప్టెన్ రియాన్ పరాగ్(14నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు టాస్ ఓడిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(6)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన సంజూ శాంసన్(6)ను నంద్రె బర్గర్(2/26) బౌల్డ్ చేశాడు. డిఫెన్స్ ఆడాలనుకున్న అతడి అంచనా తప్పుగా బంతి ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ తర్వాతి ఓవర్లో గైక్వాడ్‌ను ఆర్చర్ ఔట్ చేయగా.. ఆయుష్ మాత్రే(0)ను బర్గర్ పెవిలియన్ పంపాడు. బర్గర్, ఆర్చర్ విజృంభణతో పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయి చెన్నై పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో ఇంప్యాక్ట్ ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్(17) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, సుదీర్ఘ విరామం తర్వాత రాజస్థాన్‌కు ఆడుతున్న జడేజా తొలి ఓవర్లోనే తన మ్యాజిక్ చూపించాడు. పెద్ద షాట్లకు సిద్ధమైన సర్ఫరాజ్‌ను ఎల్బీగా ఔట్ చేయగా.. చెన్నై 51కే ఐదు వికెట్లు కోల్పోయింది. సిక్సర్ బాదిన శివం దూబే(6)ను సైతం జడేజా ఔట్ చేసి చెన్నైని మరింత కష్టాల్లోకి నెట్టాడు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కార్తిక్ శర్మ(18), జేమీ ఓవర్టన్(43)లు చివరి వరకు క్రీజ్‌లో పాతుకుపోయారు. సందీప్ శర్మ ఓవర్లో బౌండరీతో చెన్నై స్కోర్ వంద పరుగులు దాటింది. అన్షుల్ కంభోజ్ (7నాటౌట్) రెండు ఫోర్లు బాదగా.. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఓవర్టన్ సిక్స్ బాది ఆ తర్వాత బంతికే ఔటయ్యాడు. దీంతో చెన్నై 19.4ఓవర్లలో 127 పరుగులకు కుప్పకూలింది. రాజస్తాన్ బౌలర్లు ఆర్చర్, బర్గర్, జడేజాకు రెండేసి, బ్రిజేష్, సందీప్, బిష్ణోరుకు ఒక్కో వికెట్ దక్కాయి.

## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

మొదటి తరువాయి

హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎ÷-లాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం' అని హెచ్చరించారు.

# చైనా సీసీ కెమెరాల బ్యాన్

మొదటి తరువాయి

భారత్‌లో నిలిపివేయనున్నారు. ముఖ్యంగా 'స్టాండ్డంల్గ÷జేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్' అనుమతి ఉన్న కెమెరాలను మాత్రమే ఇకపై దేశంలో విక్రయించాల్సి ఉంటుంది. నిఘా పరికరాలు అత్యంత సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తాయి. విమానాశ్రయాలు, ప్రభుత్వ భవనాలు, రవాణా కేంద్రాలు వంటి కీలక ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ క్రమంలో చైనా కెమెరాల ద్వారా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ కెమెరాల్లో రహస్యంగా 'బ్యాక్ డోర్' యాక్సెస్ ఉండే అవకాశం ఉందని, దీని ద్వారా సేకరించిన సమాచారం విదేశీ సర్వర్‌లకు చేరే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్షణ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో చైనా కెమెరాలను వాడటం వల్ల మన వ్యూహాత్మక సమాచారం బయటకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సర్వైలెన్స్ మార్కెట్‌లలో ఒకటి. తాజా నిర్ణయం వల్ల చైనా కంపెనీలకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉండగా.. భారతీయ తయారీదారులకు ఇది పెద్ద అవకాశంగా మారనుంది. తద్వారా 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరగనుంది. మొత్తానికి.. డేటా భద్రతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం టెక్నాలజీ , రక్షణ రంగాల్లో పెను మార్పులకు దారితీయనుంది.

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

మొదటి తరువాయి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అక్రమాలపైన స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలనీ, లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేసింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మైనింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని తెలిపింది. జంట జలాశయాల పరిధిలో మైనింగ్ నిషేధం ఉన్నా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడిందని విమర్శించింది. సంబంధం లేని భూమిని చెరబట్టి ఎలాంటి మినరల్ డీలర్ లైసెన్స్, పొల్యూషన్ బోర్డు అనుమతి, విద్యుత్ కనెక్షన్లు, పరిశ్రమల శాఖ అనుమతి లేకుండా రెండేండ్లుగా రూ.వందల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టిందని వివరించింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని కోరితే సభ నుంచి తమను ప్రభుత్వం బహిష్కరించిందని తెలిపింది. అనంతరం మీడియాతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. శాసన సభా సంఘాన్ని ఏర్పాటు చేస్తే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని చెప్పారు. మంత్రి పొంగులేటి రూ.వందల కోట్ల అక్రమ మైనింగ్‌తోపాటు అక్రమ భూకబ్జాలు బయటకు వస్తాయన్నారు. ప్రభుత్వ ఏజెన్సీలతోనే విచారణ జరిపిస్తామంటున్నారనీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే స్వయంగా హోంమంత్రి బాధ్యతల్లో ఉన్నపుడు సీబీసీఐడీ విచారణ లేదా రాష్ట్ర హోం శాఖ అధికారులతో న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. అందుకే ఒక శాసనమండలి, శాసనసభ్యులతో కూడిన సభా సంఘాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదా స్వతంత్ర న్యాయ విచారణ, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని గవర్నర్‌కు వివరించామన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన రోజులు గుర్తుకొస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ దోపిడీని ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని చెప్పారు. బ్లాక్‌మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు.

# ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

మొదటి తరువాయి

మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని



పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో మీడియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు

# ఏప్రిల్ 1 నుంచి జనగణన..

మొదటి తరువాయి

కాబోతున్నదని, జనాభా లెక్కల సమయంలో సేకరించే పౌరుల వ్యక్తిగత సమాచారం గోప్యమైందని, ఆర్టీఐ కింద గానీ, కోర్టుల ముందు సాక్ష్యంగా గానీ, మరే ఇతర సంస్థతోనూ పంచుకోరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సారి జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టనున్నారు.

33 ప్రశ్నలు..

ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే జనాభా లెక్కల గృహాల జాబితా, గృహ గణన సందర్భంగా 33 ప్రశ్నలను అడుగుతారని ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ జనాభా గణన సంబంధిత సందేహాలు, స్వీయ గణనకు సంబంధించిన ప్రశ్నలు సహా అనేక రకాల అంశాలను ఎఫ్‌ఏక్యూలు ప్రస్తావించాయి. అదనంగా, ఇంటి ఫ్లోరింగ్, రూఫ్‌లో ఉపయోగించే పదార్థాలు, కుటుంబంలో నివసిస్తున్న వివాహిత జంటల సంఖ్య, కుటుంబ పెద్ద లింగం, వినియోగించే ధాన్యాల రకాలు, ప్రాథమిక, ఆధునిక సౌకర్యాల లభ్యత, సొంతంగా కలిగి ఉన్న వాహనాల రకాలకు సంబంధించిన ప్రశ్నలకు వివరణలను పోర్టల్ అందచేస్తుంది. జనగణన మొదటి దశలో ఎన్యూమరేటర్లు ఇంటి నంబర్(మున్సిపల్, స్థానిక పాలనాధికార సంస్థ లేదా సెన్సస్ నంబర్), ఇంటిలోపల ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థాల గురించి ప్రశ్నలతో ప్రారంభిస్తారు. అనంతరం ఇంటి వినియోగం, దాని పరిస్థితి, కుటుంబంలో సాధారణంగా నివసించే వ్యక్తుల సంఖ్యను ప్రశ్నిస్తారు. ఎఫ్‌ఏక్యూ ప్రకారం ఇంటి బాధ్యతలను నిర్వహిస్తూ ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిని కుటుంబ పెద్దగా గుర్తిస్తారు. అదేవిధంగా ఇంటి యాజమాన్య హోదాకు సంబంధించి ఒక వ్యక్తి అద్దె ఇంట్లో నివసిస్తూ భారతదేశంలో వేరే చోట సొంత ఆస్తిని కలిగి ఉంటే అది వారి తల్లిదండ్రుల ఇల్లు అయినా లేదా వారు కొనుగోలు చేసిన ఇల్లు అయినా అద్దె ఇంట్లో నివసిస్తున్నారు కాని వేరే చోట సొంత ఇల్లు ఉంది అనే ఆప్షన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

## పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

మొదటి తరువాయి

భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నక్సల్స్ విముక్త భారత్!.

మొదటి తరువాయి



నిమిషాలపాటు నక్సల్ విముక్త భారత్‌పై ప్రసంగించారు. బస్తర్ ఇప్పుడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నదని, ఈ ఘనత భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసులు, స్థానిక గిరిజన సమాజానికే దక్కుతుందని ఆయన తెలిపారు. దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ప్రక్రియ మొత్తం అధికారికంగా పూర్తయిన తర్వాత దేశానికి తెలియజేస్తాం. అయితే మన దేశం నక్సల్స్ రహితంగా మారిందని చెప్పగలను' అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను తిరస్కరించి ఆయుధాలు పట్టుకునే వారిని ఉపేక్షించబోమని, అటువంటి వారు మూల్యం చెల్లించాల్సిందేనని ఆయన చెప్పారు. ఏండ్ల తరబడి గిరిజన ప్రజలను చీకట్లో ఉంచారని, తమ సిద్ధాంతాన్ని వ్యాప్తి చేసేందుకు లెఫ్టిస్టులు వారిని తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు. స్వాతంత్ర్యం తర్వాత 60, 75 ఏండ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఆరు దశాబ్దాల పాటు గిరిజనులకు ఇండ్లు, స్కూళ్లు లేదా మొబైల్ టవర్లను కాంగ్రెస్ అందుబాటులోకి తీసుకురాలేదు. కాని ఇప్పుడు మీరేం చేశారని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. 1970వ దశకం నుంచి వీటిని ఎందుకు సాధించలేకపోయారని నక్సలిజాన్ని సమర్థించే వారిని నేను ప్రశ్నిస్తున్నాను అని అమిత్ షా నిలదీశారు. బస్తర్ నుంచి నక్సలిజాన్ని దాదాపు పూర్తిగా నిర్మూలించామని, ప్రతి గ్రామంలో పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో రేషన్ షాపులు ఏర్పాటు చేశామని, ప్రతి తహసీల్ పంచాయత్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.

## విజయ్ ఆస్తులు రూ 603 కోట్లు..

మొదటి తరువాయి



విలువ రూ.198.62 కోట్లుగా ఉంది.తన భార్య సంగీత పేరిట రూ.15.76 కోట్లు విలువజేసే ఆస్తులున్నట్టు విజ యే ప్రకటించారు. వ్యక్తిగతంగా తన వద్ద రూ.2 లక్షల నగదు, వివిధ బ్యా ంకు ఖాతాల్లో రూ.213 కోట్లకుపైగా డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు.

# తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు

**● వాహనాల విడుదలకు రూ.30 వేల లంచం డిమాండ్ ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి పట్టివేత**




**మిడ్జిల్, మార్చి 30, (నేటి దర్శిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పోలీస్ స్టేషన్‌లో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సీజ్ చేసిన వాహనాల విడుదల కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్‌రెడ్డిని అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నెల 5వ తేదీన మరికల్ ప్రాంతంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ వాహనాలపై మైనింగ్ అధికారులు సుమారు రూ.60 వేల జరిమానా విధించగా, వాహన యజమాని ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించారు. అనంతరం వాహనాల విడుదల కోసం మైనింగ్ శాఖ నుంచి అనుమతి పత్రం (రిలీజ్ లెటర్) కూడా పొందారు. అయితే, మైనింగ్ శాఖ అనుమతి పత్రాలు ఉన్నప్పటికీ వాహనాలను విడుదల చేయడానికి ఏఐ హరిప్రసాద్‌రెడ్డి రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. బాధితుడు ఇప్పటికే రూ.20 వేలు చెల్లించగా, మిగిలిన రూ.10 వేలు చెల్లిస్తేనే వాహనాలను వదులుతామని ఆయన ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. దీంతో విసిగిపోయిన వాహన యజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పథకం ప్రకారం రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. లంచం స్వీకరణకు సంబంధించిన ఆధారాలతో ఏఐని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిస్తూ అధికారులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.

# బోయిన్ పల్లి తైబజార్ వేలం పాట

**మిడ్జిల్, మార్చి30, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని బోయిన్ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం సర్పంచ్ శశికళ ఆధ్వర్యంలో తై బజార్ వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 6 మంది పోటీపడ్డారు. 83 వేల రూపాయలకు తైబజార్ మొర్గల్ల పరమేష్ దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్ రెడ్డి వార్డు సభ్యులు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.



టెండర్ దారుడు.పరమేష్

# డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి





చిల్వేర్ గ్రామం

**మిడ్జిల్, మార్చి30, (నేటి దర్శిని ప్రతినిధి):** డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ ఈగల్ టీ డిఎస్పి శంకర్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పిల్లల భద్రత డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మిడ్జిల్ మండలంలోని వస్పుల, చిల్వెరు,వాడ్యాల,మిడ్జిల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈగల్ ఫోర్స్ డీఎస్పీ శంకర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. డ్రగ్స్ వద్దు ఆటలు ముద్దు అనే నినాదాన్ని విద్యార్థులు ఆచరణలో పెట్టాలని సూచించారు. క్రికెట్ ఫుట్బాల్ వాలీబాల్ వంటి క్రీడలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెడు అలవాట్లకి దూరంగా ఉండవచ్చని చెప్పారు. డ్రగ్స్ బారిన పడితే జీవితమే నాశనం అవుతుందని హెచ్చరించారు. హైదరాబాదులో డ్రగ్స్ కారణంగా దారితప్పిన విద్యార్థుల సంఘటనలను ఉదాహరణగా వివరించి అలాంటి పరిస్థితులు ఎవరికి రాకుండా ముందుగానే జాగ్రత్తగా పడాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ కు సంబంధించిన అనుమానస్పద విషయాలు గమనించినట్లయితే 1908 హెల్ప్ లైన్ కు సమాచారం అందిస్తే ఈగల్టీం వెంటనే స్పందిస్తుందని తెలిపారు. మిడ్జిల్ మండలంలో డ్రగ్స్ వినియోగంపై కొన్ని అనుమానాలు ఉన్న నేపథ్యంలో పోలీసులు నిగా పెట్టినట్లు చెప్పారు.డ్రగ్స్ నిర్మూలల్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమాజం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి చదువులతో ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని డి.ఎస్.పి శంకర్ యాదవ్ ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జ్యోతి,గ్రామ సర్పంచ్ శంకర్,ఉప సర్పంచ్ మమత, తహసిల్దార్ స్వప్న, ఎంపీడీవో గీతాంజలి, ఎంఈఓ సరస్వతి, వైద్య సిబ్బంది సంపత్ కుమార్, వెంకటేశ్,తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్ మండల కేంద్రంలో

# ఆమనగల్ సురసముద్రం చెరువుకు సుందరీ కరణ పనులు....



**ఆమనగల్లు, మార్చి30(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్ పట్టణంలోని సురసముద్రం చెరువుకు అభివృద్ధి పనులకు గాను టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధుల నుండి రెండు కోట్ల 50 లక్షలతో సుందరీకరణ పనులను కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో చేపడుతున్న పనులను ఇరిగేషన్ డిఈ, ఏఈ, మున్సిపల్ డిఈ, ఏఈ, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ తో కలిసి మునిసిపల్ చైర్మన్ పత్యానాయక్ పనులను పరిశీలించారు. సుందరీకరణ పనులు వేగవంతంగా చేయాలని అధికారులకు చైర్మన్ సూచించారు. ఆమనగల్ మున్సిపాలిటీని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్, కౌన్సిలర్ ముక్తాల వెంకటయ్య,8వవార్డ్ కౌన్సిలర్ ఎనమల్ల రమేష్, మరియు ఎంగలి ప్రసాద్, కండేసాయి, కుమార్ గౌడ్, గుద్దేటి శివ, బైకని యాదయ్య, సభావట శ్రీను నాయక్,పూసలి సత్యం, పట్టణ ప్రముఖులు, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఎన్నికైన తిరుపతయ్యకి సన్మాన కార్యక్రమం



**మిడ్జిల్, మార్చి 30, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** జడ్చర్ల నియోజకవర్గ టీఎన్జీవో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తిరుపతయ్యని మిడ్జిల్ మండల పంచాయతీ సెక్రటరీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, తిరుపతయ్య నాయకత్వంలో ఉద్యోగుల సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉద్యోగుల హక్కుల కోసం ఆయన కట్టుబడి పని చేస్తారని తెలిపారు. తిరుపతయ్య మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, టీఎన్జీవో సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పంచాయతీ సెక్రటరీలు, టీఎన్జీవో సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు చెక్

**●చండూరులో ఉచిత టీకా కార్యక్రమం ప్రారంభం**


**●బాలికల ఆరోగ్యానికి కీలకం హెచ్‌పీవీ వ్యాక్సిన్ -- మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు**



**చండూరు, మార్చి 30 (నేటి దర్శిని):** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు కీలకమైన హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్‌పీవీ టీకా ద్వారా మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ టీకాకు వేల రూపాయలు ఖర్చవుతున్నప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాస రాజు మాట్లాడుతూ, 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో హెచ్‌పీవీ టీకా వేయనున్నట్లు తెలిపారు. టీకా పొందడానికి ఆధార్ కార్డు ఫోటోకాపీ సమర్పించాల్సి ఉంటుందని, అన్ని పనిదినాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యా బ్లెస్సి, సూపర్వైజర్ ఝాన్సీ, సిబ్బంది రజిని, మెహబూబి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను అడిగితే ముందస్తుగా అరెస్టు చేస్తారా: వర్ర వెంకటరెడ్డి

**● కాంగ్రెస్ హామీలు ఇవ్వడంలో పాస్!.... అమలు చేయడంలో ఫెయిల్!**




**హాలియా, మార్చి30( నేటి దర్శిని):** నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియా పోలీస్ స్టేషన్లో ఉదయం నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అక్రమ ముందస్తు అరెస్టులు.ఈ అక్రమ అరెస్టులతో తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అణచలేరు, తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అయినా ఉద్యమకారుల గుర్తింపు కార్డులు , నెలకు రూ.25 వేల రూపాయల పింఛను, 250 గజాల ఇంటి స్థలం మొదలైన హామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు వర్ర వెంకటరెడ్డి.


# టీపీసీసీ సాంస్కృతిక సేన నల్గొండ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఉమారాణి నియామకం



**హైదరాబాద్, మార్చి 29 (నేటి దర్శిని):** గాంధీభవన్‌లో నిన్న జరిగిన టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం కట్టంగూరు మండలం ఐటిపాముల గ్రామానికి చెందిన తోటకూరి ఉమారాణిని టీపీసీసీ సాంస్కృతిక సేన నల్గొండ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు, నల్గొండ జిల్లా అధ్యక్షుడు కోడి రాంప్రసాద్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్ కలిసి ఉమారాణికి నియామక పత్రాన్ని అందజేశారు. నియామకం అనంతరం ఉమారాణి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి పల్లెకు చేరవేసి, ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎర్ర రాధిక, సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు తడక మండల పరుశరామ్, కొమ్ము అంజి, ప్రచార కమిటీ అధ్యక్షుడు పేరాల దయానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# అదే పరిష్కారమా?




పశ్చిమాసియా ఉద్రిక్తతలు మన వంటగదిలోనూ మంటపెట్టాయి. హార్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్, ఇంధనాల కొరత నానాటికీ తీవ్రమవుతోంది. వంటగ్యాస్ (ఎల్పీజీ) సిలిండర్లకు తీవ్ర కొరత ఎదురవుతోంది. ఇప్పటివరకు అదంతా హంబక్ అంటూ కొట్టి పారేసిన కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీకి పీఎన్జీ, కిరోసిన్‌ను ప్రత్యామ్నాయంగా చూపే ప్రయత్నం చేస్తోంది. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలోనూ గ్యాస్ వాడకం పెరిగింది. అక్కడ గ్యాస్ సరఫరా మరింత అస్తవ్యస్తంగా ఉంటుంది. కాగా, అందుబాటులో ఉన్న పైప్ గ్యాస్ విధానానికి మారాలని కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో ఎల్పీజీ సరఫరా నిలిపివేసే అవకాశం ఉన్నట్లు కూడా హెచ్చరించింది. దీనికోసం మూడు నెలలు గడువిచ్చింది. మార్చి 24న కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మార్పు ఐచ్ఛికం కాదని, తప్పనిసరని ఆ ఉత్తర్వులలో స్పష్టం చేసింది. తాజాగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని రాష్ట్రాలకు కిరోసిన్ పంపిణీ చేయాలని చమురు మంత్రిత్వశాఖ ఆగమేఘాల మీద గెజిట్ నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. దీన్నిబట్టి దేశంలో గ్యాస్, ఇంధన కొరత ఉందన్న విషయాన్ని కేంద్రప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్టే. తగిన మౌలిక సదుపాయాలు పట్టణాలలోనే అన్నిచోట్లా లేవు. ఆ ప్రాథమిక సదుపాయాలు ఉన్న ఫళాన కల్పించడం అసాధ్యమని ప్రభుత్వానికి తెలుసు. అయినా పీఎన్జీకి మారిపోండని చెప్పడం మోదీ ప్రభుత్వ బూటకాలలో మరొకటి మాత్రమే. పశ్చిమాసియా సంక్షోభం వల్ల నౌకాయానానికి ఇబ్బంది ఉండొచ్చునని ప్రభుత్వం ముందే ఊహించి తగిన ఏర్పాట్లు చేసి ఉంటే గొడవే ఉండేది కాదు. అసలు ప్రతిపక్షాలతో ఈవిషయం చర్చించనే లేదు. అదేమీ చేయకుండా జనం అనవసరపు ఆందోళన వల్ల అవసరం లేకపోయినా సిలిండర్లు తెప్పించుకుంటున్నారంటూ నెపం జనం మీదకు నెట్టే ప్రయత్నం చేస్తుంది. సరైన విదేశాంగ విధానం, ఇంధన విధానం రూపొందిం చడంలో విఫలమైన ప్రభుత్వ వాదనల తీరు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఉంది. అంతా సవ్యంగానే ఉందని చెప్తున్న ప్రభుత్వం చీకటి బజారును, దొంగ నిలవలను ఎందుకు ఆపలేకపోతోందన్నదీ ఓ ప్రశ్నే. ప్రభుత్వం ఎల్పీజీ బదులు పీఎన్జీ వాడాలని చెప్తోంది. అయితే దానికి సిద్ధంగా ఉన్నామా? అది తక్షణ పరిష్కారం అవుతుందా? అన్న ఆలోచన ప్రభుత్వంలో కనిపించడం లేదు. పీఎన్జీ సరఫరా చేయడానికి అన్ని నగరాల్లో ఏ ఏర్పాటులేదు. పూర్తిగా పీఎన్జీ మీద ఆధారపడిన నగరాలు ఏపాటి గనక! పీఎన్జీకి మారడం వల్ల ప్రయోజనాలు, ధర కూడా తక్కువన్న మాట నిజమే. కానీ, మౌలిక సదుపాయాలు లేవన్నది అంతకంటే నిజం. పీఎన్జీ మరింత సురక్షితమైనదని చెబుతున్న కేంద్ర ప్రభుత్వానికి దానికి తగిన వ్యవస్థ లేదన్నది తెలియదా? ఆ సదుపాయాలు సమకూర్చకుండా లేడికి లేచిందే పరుగు అన్నట్టు పీఎన్జీకి మారిపోండని ఉచిత సలహా ఇవ్వడమంటే మరో బూటకాన్ని ప్రచారంలో పెట్టడమే. ఇది కుదిరే వ్యవ హారం కాదని ఇట్టే అర్థమవుతోంది. పీఎన్జీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ఒక్కో ఇంటికి ఐదు నుంచి తొమ్మిది వేల రూపాయల ఖర్చవుతుంది. అంత ఖర్చు ఒకే విడతలో భరించడం ఎన్ని కుటుంబాలకు సాధ్యం? దేశంలో చమురు కొరత లేదని కేంద్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. సరఫరాపై ఆంక్షలు పెడుతోంది. గతంలో ఇరవై రోజులకు ఉన్న గ్యాస్‌బుకింగ్ ఇప్పుడు మరో ఐదు రోజులకు పెంచింది. అప్పుడు మాత్రమే వినియోగదారులు గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని ఆదేశించింది. హోటళ్లు, పారిశ్రామిక అవసరాలకు సరఫరా నిలవడంతో ఇప్పటికే కొన్ని హోటళ్లు, మెస్‌లు, రెస్టారెంట్లు మూసివేశారు. హాస్టళ్లు, మెస్‌లపై ఆధారపడిన విద్యార్థులు, చిరుద్యోగులు అవస్తలు పడుతున్నారు. నిరంతరం ధరల పెరుగుదల, క్షీణిస్తున్న వాస్తవ ఆదాయాలతో కుంగిపోతున్న మధ్య తరగతి, శ్రామికులకు ఈ పరిణామాలు శరాఘాతం. తన ప్రజావ్యతిరేక విధానాలను కట్టిపెట్టి పెంచిన ధరలను కేంద్రం తగ్గించాలి. వంటగ్యాస్‌పై పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకోవాలి. ఆ మేరకు ప్రజల భారం తగ్గిం చాలి. అమెరికా సామ్రాజ్యవాద విధానాల ముందు లొంగిపోయిన మోడీ ప్రభుత్వం... పశ్చిమాసియా వివాదమే గ్యాస్ కొరతకు, ధరల పెంపునకు కారణమని సమర్థించు కోవడం దాని స్వయంకృత అపరాధాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే. యూఎస్–ఇజ్రాయిల్ యుద్ధోన్మాద విధానాలను ప్రతిఘటించాలి. పెట్రోలు, వంట గ్యాస్ కొరతను నివారించడంతో పాటు ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రానిదే.

# హిందూ మతాన్ని, ఆలయాలను ప్రధాని మోదీ పట్టించుకోరు




**న్యూఢిల్లీ : మార్చి 30 నేటి దర్శిని,**
కేరళలో ఏప్రిల్ 9వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ పాతానమిట్టలో జరిగిన సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. కేరళ పర్యటన వేళ శబరిమల అంశంపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. దీని అర్థం బీజేపీ–ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో ప్రసంగిస్తూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐఎం, బీజేపీ పార్టీలను సంయుక్తంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. తమ పార్టీ ఎల్డీఎఫ్ తో పోటీపడుతోందని, కానీ ఆ పార్టీకి బీజేపీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. బీజేపీతో ఎవరు పోరాడినా, వారిపై బీజేపీ అటాక్ చేస్తుందని, తనపై అటాక్ జరిగిందని, నాపై 36 కేసులు ఉన్నాయని, 55 గంటల పాటు నిర్విరామంగా తనను ప్రశ్నించారన్నారు. అయితే కేరళ సీఎం పినరయి విజయన్‌పై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఎల్డీఎఫ్ నాయకత్వం చాలా భ్రష్టుపట్టిందని, ఆ పార్టీ నేతలపై కేసులు ఉన్నాయని, కానీ బీజేపీ నుంచి వారిపై వత్తిడి లేదని, దర్యాప్తులు జరగడం లేదని, వాళ్లకు బెదిరింపులు కూడా లేవని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీ ఎక్కడకు వెళ్లినా.. ఆలయాల గురించి మతం గురించి మాట్లాడుతారని, కానీ పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల అంశాన్ని లేవనెత్తలేదన్నారు. అయ్యప్ప స్వామి ఆలయం నుంచి లెఫ్ట్ ఫ్రంట్ నేతలు బంగారాన్ని దోచుకెళ్లిన విషయాన్ని ప్రధాని మరిచిపోయారని రాహుల్ అన్నారు. బంగారాన్ని ఎత్తుకెళ్లిన లెఫ్ట్ ఫ్రంట్ నేతలు.. దాన్ని ఇత్తడితో నింపేశారని ఆరోపించారు. శబరిమల అంశంపై ప్రధాని మౌనంగా ఉండి బీజేపీకి నష్టం జరగకుండా చూసే ప్రయత్నం చేశారన్నారు. దీని వల్ల బీజేపీ, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్లు స్పష్టమైందని, ఇక ప్రధాని మోదీ మతాన్ని పట్టించుకోరని, హిందూ మతాన్ని కానీ ఆలయాలను కానీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓట్లు వస్తాయంటే, అప్పుడు ఆయన ఆలయాల గురించి మాట్లాడుతారని, ఎల్డీఎఫ్ ప్రయోజనాలను రక్షించాలంటే , ఆయన ఆలయాల గురించి మాట్లాడరని రాహుల్ అన్నారు. ఒకవేళ యూడీఎఫ్ అధికారంలోకి వస్తే, అప్పుడు ఆలయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్‌డీఎప్ ఓ లెఫ్ట్ పార్టీ తరహాలో వ్యవహరించడం లేదన్నారు. ఆ పార్టీ చర్యలు, విధానాలు అన్నీ.. బీజేపీకి కార్పొరేట్ తొత్తులా ఉన్నాయని, కార్పొరేట్ సపోర్టుతో ప్రభుత్వాన్ని నడుపుతున్నట్లుగా ఉందని రాహుల్ అన్నారు.

# విస్తృతంగా వ్యాపిస్తున్న BA.3.2 కోవిడ్ వేరియంట్

- 23 దేశాల్లో కేసులు నమోదు

**న్యూఢిల్లీ : మార్చి 30 నేటి దర్శిని,**
కోవిడ్‌కు చెందిన BA.3.2 వేరియంట్ ప్రస్తుతం మళ్లీ విజృంభిస్తున్నది. ఆ వైరస్ వేరియంట్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్నది. సుమారు 23 దేశాల్లో ఆ వేరియంట్‌కు చెందిన కేసులు నమోదు అయినట్లు అమెరికాకు చెందిన సీడీసీ పేర్కొన్నది. అమెరికాలోనూ భారీగా దీూ. 3.2 వేరియంట్ కేసులు నమోదు అవుతున్నట్లు సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ పేర్కొన్నది. BA.3.2 వేరియంట్‌ను సికాడా వేరియంట్‌గా పిలుస్తున్నారు. అయితే చాపకింద నీరులా ఆ వైరస్ వేరియంట్ వ్యాపిస్తున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారీ సంఖ్యలో ఆ వేరియంట్ మ్యుటేషన్లకు గురవుతున్నది. సార్స్ సీవోవీ2కి చెందిన BA.3.2 వేరియంట్‌ను 2024లో తొలుత దక్షిణాఫ్రికాలో గుర్తించారు. జన్యుపరంగా BA.3.2 వేరియంట్‌ను భిన్నంగా అంచనా వేస్తున్నారు. స్పైక్ ప్రోటీన్‌లో సుమారు 75 మ్యుటేషన్లు ఉన్నట్లు గుర్తించారు. మానవ కణాలను చుట్టుకునే వైరస్‌లోని భాగమే స్పైక్ ప్రోటీన్. JN.1 , LP.8.1 వేరియంట్లలో స్పైక్ ప్రోటీన్‌లో కేవలం 40 మ్యుటేషన్లు మాత్రమే జరుగుతున్నట్లు సీడీసీ వెల్లడించింది. BA.3.2 వేరియంట్ సోకిన వారిలో సాధారణ కోవిడ్ లక్షణాలే ఉండనున్నాయి. గొంతు నొప్పి, దగ్గు, తెమడ, నీరసం, తలనొప్పి, జ్వరం లాంటి లక్షణాలు ఉంటాయి. కొందరిలో ఉదర సంబంధిత సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని సీడీసీ చెప్పింది. అమెరికాలోని సుమారు 25 రాష్ట్రాల్లో BA.3.2 వేరియంట్ కేసుల్ని గుర్తించారు. అమెరికా విమానాశ్రయాల వద్ద అంతర్జాతీయ పర్యాటకుల నుంచి సేకరించిన నాసల్ స్వాబ్ శ్యాంపిళ్లలో ఈ వేరియంట్ ఉన్నట్లు అనుమానిస్తున్నారు. సికాడా స్ట్రెయిన్ వల్ల భారీ మొత్తం మరణాలు ఉండవంటున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టీకాలు కొంత వరకు పనిచేస్తాయని భావిస్తున్నారు.



# ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్, : మార్చి 30 నేటి దర్శిని,**
ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హార్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్‌ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్‌ఎస్ ట్రిపోలిపై ఎఫ్–31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్‌ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

# అమెరికాకు స్పెయిన్ షాక్

- గగనతలంలో విమానాలకు అనుమతి నిరాకరణ



**న్యూఢిల్లీ : మార్చి 30 నేటి దర్శిని,**
అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు స్పెయిన్ ప్రకటించింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలు పంచుకొనే విమానాలను అనుమతించమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ సోమవారం వెల్లడించారు. ఇరు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక స్థావరాలను పశ్చిమాసియా ఘర్షణల కోసం వినియోగించడాన్ని ఇప్పటికే స్పెయిన్ నిరాకరించింది. 'ఇరాన్ యుద్ధానికి సంబంధించిన కార్యకలాపాల కోసం మిలిటరీ స్థావరాలు లేక గగనతలాన్ని వియోగించడానికి అనుమతి ఇవ్వబోం. ఏక పక్షంగా, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ప్రారంభించిన యుద్ధంలో సహకరించకూడదని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిలో భాగంగానే తాజా ప్రకటన వచ్చింది' అని రక్షణ, ఆర్థిక మంత్రులు స్థానిక మీడియాలో వెల్లడించారు.

# బంగారు గని వద్ద దుండగుల దాడి

**70 మంది మృతి..!**



**సూడాన్ : మార్చి 30 నేటి దర్శిని,**
దక్షిణ సూడాన్‌లో మారణహోమం చోటుచేసుకుంది. రాజధాని జుబాకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న జెబెల్ ఇరాక్ బంగారు గని వద్ద గుర్తుతెలియని సాయుధ దుండగులు జరిపిన దాడిలో 70 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య 85 వరకు ఉండొచ్చని కొన్ని అనధికారిక వర్గాలు చెబుతున్నాయి. ప్రాథమిక నివేదికల ప్రకారం, బంగారు గని వద్ద తలెత్తిన ఒక వివాదమే ఈ దాడికి కారణమైంది. సాయుధ దుండగులు ఒక్కసారిగా పౌరులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రాంతంలోని గనిపై దాడి జరగడం ఇది రెండోసారి. ఈ ఘటనపై దక్షిణ సూడాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. అయితే, దేశ మైనింగ్ మంత్రిత్వ శాఖ ఈ దాడిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ దాడి దేశంలోని బలహీనమైన శాంతి ప్రక్రియకు మరింత విఘాతం కలిగిస్తుందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక

# కొత్తూరు పోలీసుల ఓపికకు సలాం..!

● 18 నెలల తర్వాత కుటుంబానికి చేరిన వృద్ధుడు





**కొత్తూరు 30 మార్చ్ (నేటి దర్శిని ప్రతినిధి)**
18 నెలల క్రితం తప్పిపోయిన వృద్ధుడిని చివరకు కుటుంబ సభ్యుల వద్దకు చేర్చిన గొప్ప మానవత్వం మరోసారి వెలుగులోకి వచ్చింది.పత్రిక విలేఖరి ఎండి అజీమ్ మరియు అతని బృందం చూపిన చొరవతో పాటు కొత్తూరు పోలీసుల సహకారం వల్ల వృద్ధుడి వివరాలు కుటుంబ సభ్యులకు చేరాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కొత్తూరుకు చేరుకుని తమ బంధువును చూసి భావోద్వేగానికి లోనయ్యారు.ఈ ఘటనలో పోలీసుల ఓపిక, కర్తవ్యనిబద్ధతకు స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే మానవత్వంతో ముందుకొచ్చిన ఎండి అజీమ్ బృందాన్ని అభినందిస్తున్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర ఫోన్ నెంబర్ల బోర్డులు...!



**ఉమ్మడి వరంగల్, మార్చి 30 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 2,533 పాఠశాలలకు అత్యవసర ఫోన్ నెంబర్ల బోర్డులు ఏర్పాటు చేయడానికి ఒక్కో పాఠశాలకు రూపాయలు 500 ప్రభుత్వం కేటాయించింది. ఈ బోర్డులలో హాస్పిటల్ ,పోలీస్, ఫైర్, కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు ఫోన్ నెంబర్లు రాయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లాలో 404 పాఠశాలలకు రూపాయలు 2,02,000, హనుమకొండ జిల్లాలో 333 పాఠశాలలకు రూపాయలు 1,66,500, మహబూబాబాద్ జిల్లాకు 739 పాఠశాలలకు రూపాయలు 3,69,500, ములుగు జిల్లాకు 375 పాఠశాలలకు రూపాయలు 1,87,500, భూపాలపల్లి జిల్లాలో 337 పాఠశాలలకు రూపాయలు 1,68,500, జనగామ జిల్లాకు 345 పాఠశాలకు రూపాయలు 1,72,500 మంజూరైనట్లు సమాచారం.

## సోషల్ మీడియాలో మేలు కంటే ఎక్కువ కీడు జరుగుతుంది


● ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు



**ఉమ్మడి వరంగల్, మార్చి 30 (నేటి దర్శన బ్యూరో):**
అసభ్యకరమైన పోస్టులను నియంత్రించాల్సిన అవసరం ఉందని, సోషల్ మీడియా వచ్చాక మేలు కంటే ఎక్కువ కీడు జరుగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజ్ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిన్న తాను రవీంద్రభారతిలో గద్దర్ వేషధారణ వేస్తే, దానిపై , నేడు ట్రోలింగ్ స్టార్ట్ చేశారని అన్నారు .మహిళల పట్ల విచక్షణ జ్ఞానాన్ని కోల్పోతున్నారని సభ దృష్టికి తెచ్చారు.

## మంచి కన్నా,అబద్ధాలు తొందరగా ప్రపంచంలో వ్యాపిస్తున్నాయి

● ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**ఉమ్మడి వరంగల్, మార్చి30 (నేటి దర్శిని బ్యూరో):**
సమాజంలో మంచి కన్నా చెడు తొందరగా వ్యాపిస్తుందని ,నిజాలు వాకిలి దాటేలోపే అబద్దాలు ప్రపంచానికి వ్యాపిస్తున్నాయని ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, ఎన్నో సవాలను ఎదుర్కొని , మహిళలు బయటకు వచ్చి రాణిస్తున్నారని స్పష్టం చేశారు.

# వరంగల్‌లో కేంద్ర ఉన్నత విద్యాసంస్థల ఆవశ్యకతపై.... లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

● తెలంగాణకు కేంద్ర ఉన్నత విద్యాసంస్థల్లో అన్యాయం



**ఉమ్మడి వరంగల్, మార్చి 30 (నేటి దర్శిని బ్యూరో)**
తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఉన్నత విద్యాసంస్థలు పరిమితంగా ఉండటంపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆందోళన వ్యక్తం చేశారు.సోమవారం పార్లమెంట్ లో ప్రశ్నోత్తర సమయంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కేంద్ర ఉన్నత విద్యాసంస్థల సంఖ్య, వరంగల్‌లో వాటి స్థితి, 2023-25 కాలానికి మౌలిక వసతులు, పరిశోధన గ్రాంట్లు, డిజిటల్ లెర్నింగ్‌కు కేటాయించిన నిధుల వివరాలు కోరారు. అలాగే ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి , నియోజకవర్గ స్థాయిలో విద్యార్థుల నమోదు గణాంకాలు, కేంద్ర పథకాల కింద స్కాలర్‌షిప్ లబ్ధిదారుల వివరాలు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపుకు కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగారు.ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానంలో తెలంగాణలో కేవలం 9 కేంద్ర ఉన్నత విద్యాసంస్థలు మాత్రమే ఉన్నాయని, వరంగల్ నియోజకవర్గంలో ఒక్క నిట్ మాత్రమే ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో 35 కేంద్ర విద్యాలయాల్లో వరంగల్‌కు ఒకటే కేటాయించడం కేంద్ర వైఖరిని స్పష్టంగా చూపుతోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. తెలంగాణలో ఉన్నత విద్యలో నమోదు నిష్పత్తి దేశ సగటు కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, కేంద్రం నుంచి తగిన మౌలిక వసతులు, సంస్థలు అందకపోవడం రాష్ట్ర యువతకు నష్టం కలిగిస్తోందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్‌లో 1.65 లక్షలకుపైగా విద్యార్థులు ఉన్నప్పటికీ, కేంద్ర స్థాయి విద్యాసంస్థల విస్తరణ జరగకపోవడం దురదృష్టకరమని అన్నారు.నిట్ వరంగల్‌కు కేటాయించిన రూ.64.38 కోట్ల నిధులు సరిపోవని, కొత్త కేంద్ర విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డిమాండ్ చేశారు.కేంద్రం ప్రకటిస్తున్న పథకాలు కాగితాలపైనే మిగిలిపోకుండా, తెలంగాణలో భౌతికంగా సంస్థల రూపంలో కనిపించాలన్నారు.

వరంగల్ వంటి అర్బన్-రూరల్ ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్రం తక్షణ చర్యలు తీసుకుని, విద్యా రంగంలో సమానత్వాన్ని పాటించాలని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు.

# దాతల సొమ్ము ధర్మకర్తల పాలు?

- కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయంలో అక్రమాల ఆరోపణలు కలకలం
- లక్ష రూపాయల దానం మాయం... మూడు నెలల తర్వాత బయటపడిన నిజం
- ఇద్దరు ధర్మకర్తలపై అక్రమ వసూళ్ల ఆరోపణలు
- అర్చకులు, పార్కింగ్ సిబ్బంది, కొబ్బరి వ్యాపారుల నుంచీ వసూళ్లు
- ఉప ఆలయాల్లో విధుల పేరుతో భారీ డబ్బుల సేకరణ
- మధ్యవర్తిగా వ్యవహరించిన ఉద్యోగిపై అనుమానాలు
- ఛైర్మన్ నిర్లక్ష్యం, ఈవోపై ప్రశ్నల వర్షం
- విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్న భక్తుల డిమాండ్




**కర్మన్‌ఘాట్, మార్చి30 (నేటి దర్శిని):**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో అక్రమాల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. దాతలు ఇచ్చిన సొమ్ము దుర్వినియోగం అవుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, ఇద్దరు ధర్మకర్తల వ్యవహారం పై భక్తుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.మూడు నెలల క్రితం ఆలయ అభివృద్ధి కోసం ఓ దాత అందజేసిన రూ.1 లక్ష విరాళం మాయం అయిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ఛైర్మన్ సూచనతో ఆ మొత్తాన్ని ఒక ధర్మకర్తకు అందజేసిన దాత, ఇటీవల ఆలయానికి వచ్చి పనుల పురోగతిపై ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. మొదట ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చేశానని చెప్పిన ధర్మకర్త, తర్వాత అసలు డబ్బు వినియోగంపై స్పష్టత ఇవ్వలేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే కాకుండా, ఆలయంలో ఇద్దరు ధర్మకర్తలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్చకుల నుంచి డైరీలు ముద్రిస్తామంటూ రూ.40 వేల వరకు వసూలు చేసి, తక్కువ ఖర్చుతో పనులు చేసి మిగతా డబ్బును దుర్వినియోగం చేశారన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా, ఆదాయం వచ్చే ఉప ఆలయాల్లో విధులు ఇప్పిస్తామని చెప్పి అర్చకుల నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్కింగ్ నిర్వాహకులు, కొబ్బరి చిప్పలు సేకరించే వారినీ వదలకుండా అక్రమ వసూళ్లు జరిపినట్లు భక్తులు చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఆలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ మధ్యవర్తిగా వ్యవహరించాడన్న ఆరోపణలు ఉన్నాయి. డిప్యూటేషన్‌పై వచ్చి ఇక్కడే కొనసాగుతున్న అతని పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో జరుగుతున్న ఈ అక్రమాలపై ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే రాజీనామా చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా, ఆలయ ఈవో లావణ్యను సస్పెండ్ చేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై స్పందించిన ఈవో లావణ్య, సరైన ఆధారాలు అందితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, నేడు ఆలయ ప్రాంగణంలో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్థానిక భక్తులు, మాజీ ధర్మకర్తలు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన ఈ ఆలయంలో జరుగుతున్న ఈ ఘటనలు భక్తుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

# సరస్వతి శిశు మందిర్ స్కూల్ లో ఘనంగా వార్షికోత్సవం





**హైదరాబాద్, మార్చి 30 (నేటి దర్శిని):**
సైదాబాద్ సరస్వతి నగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రీ-ప్రైమరీ విద్యార్థులు వార్షికోత్సవ వేడుకల్లో తమ అద్భుతమైన ప్రదర్శనలతో మమ్మందరినీ మంత్రముగ్ధులను చేశారు. ఇంకా నడవడం, మాట్లాడటం నేర్చుకుంటున్న వయసులోనే, ఈ బుల్లి తారలు తమ నృత్యాలు, స్కిట్‌లు, మరియు రంగస్థల ప్రదర్శనలతో అందరినీ ఆశ్చర్యపరిచారు ప్రతిభకు వయసుతో సంబంధం లేదని నిరూపించారు. అలుపెరగని కృషి, ఓర్పు, మరియు సృజనాత్మకతతో దీనిని సాధ్యం చేసిన మా అంకితభావం గల ప్రీ-ప్రైమరీ ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు. అంత చిన్న పిల్లలకు శిక్షణ ఇవ్వడం చిన్న విషయం కాదు, అయినప్పటికీ వారు పిల్లలను ఎంతో అందంగా తీర్చిదిద్ది, వేదికపై ప్రకాశించేలా మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డా. రఘుతేజ లేజర్ మరియు లాప్రోస్కోపిక్ సర్జన్, కాస్మోగట్ వ్యవస్థాపకులు, లైఫ్‌స్టైల్ మెంటర్ శ్రీ వై. మాధవ రెడ్డి గారు వందమేతారం ఫౌండేషన్ కార్యదర్శి అనఘ వెంకట లక్ష్మి ఎస్‌విపి రాష్ట్ర కార్యదర్శి డి. పురుషోత్త పాఠశాల అధ్యక్షుడు, శ్రీ కుందూరు విద్వాన్ రెడ్డి సమితి కార్యదర్శి, శ్రీమతి శివలీల ప్రిన్సిపాల్ ఈ కార్యక్రమానికి హాజరై తల్లిదండ్రులకు తమ విలువైన సందేశాన్ని అందించారు. మాధవ రెడ్డి విద్యార్థులను ప్రోత్సహించి బహుమతులు అందజేశారు. వారి భవిష్యత్తులో ముందుకు సాగడానికి ఇది వారికి గొప్ప ప్రోత్సాహం. శ్రీమతి లక్ష్మీ మాతాజీ విద్యార్థులు, ఉపాధ్యాయుల గురించి మరియు క్లుప్తంగా మన లక్ష్యం గురించి తల్లిదండ్రులకు సందేశం ఇచ్చారు. డా. రఘుతేజ జ్ఞానేంద్రియాలపై ఒక కథ చెప్పి సందేశం అందించారు. ఇది తల్లిదండ్రులకు ఒక అద్భుతమైన సందేశం. ఈ వార్షికోత్సవాన్ని ఒక అద్భుతమైన కార్యక్రమంగా తీర్చిదిద్దడంలో నిరంతరం మార్గదర్శకత్వం, ప్రోత్సాహం మరియు మద్దతు అందించిన మా యాజమాన్య కమిటీ మరియు సమితి సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

# విద్యార్థులకు మాదక ద్రవ్యాల అవగాహన సదస్సు



- మహబూబ్‌నగర్ జిల్లా అధికారుల సమక్షంలో బృందావన్ గార్డెన్ డ జేపీఎన్‌సీఈ ఇంజనీరింగ్ కళాశాలలో కార్యక్రమాలు
- జిల్లాలోని 16 మండలాలలో మండలానికి నాలుగు చొప్పున మొత్తం 64 గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు








**మిడ్జిల్, మార్చి30 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మహబూబ్‌నగర్ జిల్లాలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రతి మండలానికి నాలుగు గ్రామాల చొప్పున పిల్లల భద్రత నిమిత్తం మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన సదస్సులు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమాల్లో ప్రజల విస్తృత భాగస్వామ్యం కనిపించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభమై, అనంతరం ర్యాలీలు, మానవహారాలు, సభలు నిర్వహించబడినవి. మహబూబ్‌నగర్ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌తో పాటు జేపీఎన్‌సీఈ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రధాన అవగాహన కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ శ్రీమతి కుష్బూ గుప్తా, ఐఏఎస్ గారు, జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్, తెలంగాణ ఈగల్ ఫోర్స్ అదనపు ఎస్పీ శ్రీ కృష్ణమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్, డీఈఓ ప్రవీణ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీమతి జరీనా తదితరులు పాల్గొన్నారు. సుమారు 2000 మంది విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి కుష్బూ గుప్తా మాట్లాడుతూ: యువత దేశ భవిష్యత్తు కాబట్టి వారు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, విద్యార్థులలో సానుకూల దృక్పథం పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల భద్రత, వారి వ్యక్తిత్వ వికాసం కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి మాట్లాడుతూ: మాదకద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేసే అత్యంత ప్రమాదకరమైన వ్యసనమని పేర్కొన్నారు. ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడితే అది ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తు అన్నింటినీ దెబ్బతీస్తుందని వివరించారు. సమాజంలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు తమ లక్ష్యాలను గుర్తించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. "నో స్మోకింగ్ -- నో డ్రింకింగ్ -- నో డ్రగ్స్" అనే నినాదాన్ని ప్రతి యువకుడు తన జీవితంలో పాటించాలని తెలిపారు. డయల్ 1908, 112 వంటి హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ అదనపు ఎస్పీ శ్రీ కృష్ణమూర్తి మాట్లాడుతూ: రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూలన కోసం ఈగల్ ఫోర్స్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, యువతను రక్షించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించే అంబాసిడర్లుగా మారాలని సూచించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, విద్యార్థులకు స్పోర్ట్స్ సామగ్రి పంపిణీ చేసి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. "జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా గ్రామాలలో విస్తృత అవగాహన సదస్సులు" సోమవారం జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రతి మండలానికి నాలుగు గ్రామాల చొప్పున మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. మండలం -- గ్రామాలు వివరాలు: మహబూబ్‌నగర్ రూరల్: అప్పన్నపల్లి, ధర్మపురి మహబూబ్‌నగర్ అర్బన్: అంబేద్కర్ కళాభవన్, రామయ్య బౌలి జడ్చర్ల: జడ్చర్ల, కోడుగల్, నసురుల్లాబాద్, పోలేపల్లి అడ్డాకుల: అడ్డాకల్, బలిదుపల్లి, రాచాల, కాటవరం బాలానగర్: ఓడిత్య, మోతిఘన్పూర్, కేతిరెడ్డిపల్లి, బాలానగర్ భూత్పూర్: భూత్పూర్, వెలికిచర్ల, పోతులమడుగు, తాటికొండ సీసీకుంట: లాల్కోట, ఫరీద్పూర్, వడ్డెమాను, సీసీకుంట దేవరకద్ర: డోకూర్, దేవరకద్ర, వెంకటయ్యపల్లి, కోయిల్సాగర్ గండేడ్: గండేడ్, కొమిరెడ్డిపల్లి, వెన్నచేడ్, పగిడియాల హన్వాడ: హన్వాడ, ఇబ్రహీంపూర్, గుండాల్ కోయిల్‌కొండ: కోయిల్‌కొండ, అవంగపట్నం, మల్కాపూర్, వింజమూర్ మిడ్జిల్: మిడ్జిల్, వసుపుల, వడిట్యాల్, చిల్వేర్ మూసాపేట్: జానంపేట, మూసాపేట్, కొమిరెడ్డిపల్లి, వేముల నవపేట్: నవపేట్, ఎన్.మనుగండ్ల, చౌదూర్, కొల్లూరు రాజాపూర్: రాజాపూర్, ఈద్గాన్పల్లి, తిరుమలపూర్, రంగారెడ్డి గూడా మహబూబాబాద్ టీఎస్ పరిధి: మహబూబాబాద్, మంగంపేట్, ధర్మపురి, చౌడపల్లి ఈ ప్రాంతాల్లో ర్యాలీలు, మానవహారాలు, అవగాహన సభలు నిర్వహించి ప్రజలకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృతంగా వివరించారు. "జడ్చర్ల మండలంలో ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం" జడ్చర్ల మండలం పరిధిలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీ ఎన్. బుచ్చయ్య ఆధ్వర్యంలో శ్రీ స్వామి నారాయణ గురుకుల్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన పొందారు. టోల్ ఫ్రీ నంబర్లు 1908, 112పై వివరించారు. ప్రజలకు విజ్ఞప్తి సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరం. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలి. టోల్ ఫ్రీ నంబర్: 1908, వాట్సాప్: 87126 71111, ఇమెయిల్:ొఅఖుఎష్ట్రశీ-ష్ట్రఎఎవ్‌ంజూశీ-శ్రీఅఎవ.స్త్రశీజ.అఅ మరియు మహబూబ్‌నగర్ జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 8712659360 అందించిన సమాచారం గోప్యంగా ఉంచబడుతుంది. విశ్వసనీయ సమాచారాన్ని అందించిన వారికి తగిన బహుమతులు ఇవ్వబడతాయి.

# అశుభ్రతలో మునిగిన అమీర్పేట సర్కిల్ కార్యాలయం



- "పట్టణ ప్రగతి" కాగితాలకే పరిమితం..!
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల తీవ్ర ఆగ్రహం




**అమీర్పేట, మార్చి 30 (నేటి దర్శిని):**
ప్రజలకు సేవలు అందించాల్సిన అమీర్పేట సర్కిల్ కార్యాలయం ప్రస్తుతం అశుభ్రతకు కేంద్రబిందువుగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయ ప్రాంగణం మొత్తం చెత్త కుప్పలతో నిండిపోవడం, మూత్రశాలలు దయనీయ స్థితిలో ఉండటం ప్రజలు, సిబ్బంది ఇద్దరికీ తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా కార్యాలయంలోని మూత్రశాలల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. గోడలు మురికితో కప్పబడి ఉండగా, దుర్వాసనతో లోపలికి వెళ్లడం కూడా కష్టంగా మారిందని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా లేకపోవడం, సరైన శుభ్రపరిచే చర్యలు చేపట్టకపోవడం వల్ల రోజురోజుకూ పరిస్థితి మరింత దిగజారుతోంది. ఇది ప్రభుత్వ కార్యాలయానికి ఏమాత్రం తగని పరిస్థితి అని ప్రజలు మండిపడుతున్నారు. కార్యాలయ పరిసరాల్లో కూడా పరిస్థితి అంతే దారుణంగా ఉంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, పాడైన ఫర్నిచర్, పాత సామగ్రి పేరుకుపోయి ఉండడం గమనార్హం. వాటిని తొలగించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. కార్యాలయానికి వచ్చిన సిబ్బంది పనుల కంటే బయట తిరగడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఆరోపణలు**

సర్కిల్ కార్యాలయాల నిర్వహణ బాధ్యత వహించాల్సిన ఇంజనీరింగ్ విభాగం పూర్తిగా వైఫల్యం చెందిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్వహణ నిధులు సక్రమంగా వినియోగించడంలేదని, అవినీతి జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీస బాధ్యత తీసుకోకుండా అధికారులు కాలక్షేపం చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

**"99 రోజుల ప్రజా పాలన" ఎక్కడ?**

ప్రభుత్వం ఎంతో ప్రాచుర్యం కల్పిస్తున్న "99 రోజుల ప్రజా పాలన, పట్టణ ప్రగతి" కార్యక్రమం అమీర్పేట సర్కిల్‌లో అమలవుతున్నట్లు ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగితాలపైనే కార్యక్రమాలు కొనసాగుతున్నాయే కానీ, వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని అంటున్నారు. స్వంత కార్యాలయాన్ని శుభ్రంగా నిర్వహించలేని అధికారులు కాలనీలు, బస్తీల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఫిర్యాదులపై స్పందన లేకపోవడం, సమస్యలను పట్టించుకోకపోవడం వంటి అంశాలు ప్రజల్లో అసంతృప్తిని మరింత పెంచుతున్నాయి. అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యం కలిసి అమీర్పేట సర్కిల్ కార్యాలయాన్ని నిర్వీర్యం చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఇప్పటికైనా ముఖ్యమంత్రి, జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కార్యాలయాన్ని వెంటనే శుభ్రపరిచి, పరిశుభ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఈ సర్కిల్‌లో ప్రజల సమస్యలు ఎప్పుడు పరిష్కారం పొందుతాయో అన్నది ప్రస్తుతం పెద్ద ప్రశ్నగా మారింది.

## వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయాలతో చేయాలి: మంత్రి సురేఖ



**ఉమ్మడి వరంగల్, మార్చి 30 (నేటి దర్శిని బ్యూరో):**
ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని రాబోయే వనమహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, మార్చి30 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం ఐఎంఐ హాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం ప్రారంభించారు. యాత్రికుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిస్తూ వైద్య ఆరోగ్యశాఖ, హజ్ కమిటీ సంక్షిప్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాత్రికులు అందరూ ఆరోగ్యంగా సురక్షితంగా తమ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు.

# ఆమనగల్లులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కసరత్తు...

● కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా..




**ఆమనగల్లు, మార్చి30(నేటి దర్శిని ప్రతినిధి):** అగ్ని ప్రమాదాల నివారణకు నాలుగు మండలాల కూడలి అయినటువంటి ఆమనగల్లు పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని గతంలో కేఎన్ఆర్ సేవాదళం ఆధ్వర్యంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి విన్నవించడం జరిగింది. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే సేవాదళం వినతిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి నివేదించడం జరిగింది. ఈ క్రమంలో ఆమనగలు పట్టణంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సంబంధిత అధికారులు కసరత్తు ఆరంభించారు. సోమవారం అగ్నిమాపక శాఖ అధికారి ఆమనగల్లు లోని అటవీశాఖ రేంజ్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి వివరాలు సేకరించడం జరిగింది. ఆమనగల్లు లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు పూర్తయితే సమీప మండలాల ప్రజలకు మేలు జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

# పదవి విరమణ పొందుతున్న విద్యావతమ్మకు ఘన సన్మానం......



**ఆమనగల్లు,మార్చి30(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న తెలుగు ఉపాధ్యాయురాలు విద్యావతమ్మను కౌన్సిలర్లు సోమవారం వారిని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న 5వ వార్డు కౌన్సిలర్ ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము,15వ వార్డు కౌన్సిలర్ యంగలి భాగ్యలక్ష్మి రఘు, విద్యావతమ్మ సేవలను కొనియాడారు.వారు వారి కుటుంబంతో కలిసి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతోని జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి సర్పంచ్ సత్యం, ఉపాధ్యాయురాలు,పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను అరెస్టు చేయడం దుర్మార్గం

● మలిదశ ఉద్యమకారులు కట్న రాజు,బ్యాగరి సత్తయ్య సంతోష్ నాయక్,పెంటన్నోళ్ల యాదగిరి, దేశాల జైపాల్




**కొత్తూరు 30 మార్చి నేటి దర్శిని ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని మలిదశ ఉద్యమకారులు కట్న రాజు,బ్యాగరి సత్తయ్య,సంతోష్ నాయక్,పెంటన్నోళ్ల యాదగిరి, దేశాల జైపాల్ సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.కానీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులను పోలీస్ స్టేషనుకు తరలించడం దుర్మార్గమని అయిన మొక్కవోని ధైర్యంతో పోలీస్ స్టేషన్ లోనే దీక్ష కూర్చోవడం జరిగిందన్నారు. ఉద్యమకారులకు రావలసిన న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని అరెస్ట్ చేసిన ఉద్యమకారులను బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# మున్సిపాలిటీలో వీధి దీపాలు ఏర్పాటు

● కౌన్సిలర్ సోమ్లా నాయక్ తో కలిసి ప్రారంభించిన చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



**కొత్తూరు 30 మార్చ్ నేటి దర్శిని ప్రతినిధి**
కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ కౌన్సిలర్ సోమ్లా నాయక్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో బైపాస్ నుంచి పెద్దమ్మ తండా వరకు ఏర్పాటు చేసిన వీధి దీపాలను మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ..పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి వీధిలో సరైన వెలుగులు ఏర్పాటు చేయడం తమ లక్ష్యమని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్,మాదారం నరసింహ గౌడ్,మాధవి గోపాల్ గౌడ్, ప్రసన్నత యాదయ్య, నాయకుడు బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సాకిబండ తండాలో రామాలయం నిర్మాణానికి శ్రీకారం....



**ఆమనగల్లు, మార్చి30(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు సాకి బండ తండాలో నూతన రామాలయం నిర్మాణానికి సంబంధించి సోమవారం తండా నాయకులతో కలిసి పరిసర ప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రామాలయం నిర్మాణానికి అనుసంధానంగా సాకిబండ తండా నుండి కొత్త రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని తండా అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం డోజర్ సహాయంతో రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే రాబోయే రెండవ తారీకున జరగనున్న హనుమాన్ జయంతి వేడుకలను తండావాసులు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వేడుకలను రామాలయం నుండి భారీ ఎత్తున నిర్వహించేందుకు తండా పెద్దలు పిలుపునిచ్చారు. ఈ కార్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తండావాసులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి రాథోడ్ ,పత్యా నాయక్,సక్రు,బోడియ నాయక్, రమేష్ నాయక్, మణిపాల్ , నాయక్, బాలు, పాండు, రమేష్, శివరాం ,రాజు,గోపి,కళ్యాణ్, దశరథ్, దేవేందర్, లాలు , కుబ్య , అశోక్ నాయక్ ,జైపాల్, తండావాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పెంజర్లలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

● గ్రంథాలయం కోసం రూ.30 లక్షల కేటాయించండి
● గ్రేడ్ వన్ అధికారి ప్రతాప్ కి లెటర్ అందజేసిన సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్



**కొత్తూర్ మార్చ్ 30 ( నేటి దర్శన ప్రతినిధి )**
కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో శాఖ గ్రంథాలయం ఏర్పాటు కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జిల్లా గ్రంథాలయ సంస్థను అభ్యర్థించారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అలుగంటి మధుసూధన్ రెడ్డి గారికి లేఖ రాశారు. బడంగ్పేట్ లో గ్రంథాలయ కార్యాలయంలో గ్రేడ్ వన్ అధికారి ప్రతాప్ కి లేఖను సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం ద్వారా చదువుల పట్ల ఆసక్తి పెరిగి, విద్యార్థులు మరియు ప్రజలకు జ్ఞాన వనరులు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. గ్రంథాలయం నిర్మాణానికి అవసరమైన భూమి అందుబాటులో ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం రూ.30 లక్షల నిధులను వీలైనంత త్వరగా మంజూరు చేయాలని కోరారు.

# అసంఘటిత కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలి..

● కనీస వేతనాల అమలు, హక్కుల పరిరక్షించాలి: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**నేటి దర్శిని /గోదావరిఖని: మార్చి30**
అసంఘటిత కార్మికుల సమస్యలపై స్పందిస్తూ సోమవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత రంగం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఇంకా ప్రాథమిక హక్కులు, భద్రత, కనీస వేతనాల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు---నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, గృహ సేవకులు, చిన్న పరిశ్రమల కార్మికులు---దేశ అభివృద్ధికి పునాది లాంటివారని, కానీ వారి కష్టానికి తగిన గుర్తింపు, రక్షణ, గౌరవం లభించడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా కనీస వేతనాలు అమలు కాకపోవడం, సామాజిక భద్రతా పథకాల లోపం, ఆరోగ్య భద్రత లేకపోవడం వంటి సమస్యలు వారి జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయని అన్నారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరారు.
అసంఘటిత కార్మికులకు కనీస వేతనాల అమలును కచ్చితంగా నిర్ధారించాలని,
ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డు జారీ చేసి, వారి డేటాను నమోదు చేయాలి.
ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి భద్రతా పథకాలను విస్తరించాలన్నారు.
మహిళా కార్మికుల కోసం ప్రత్యేక రక్షణ చర్యలు,
బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు అమలు చేయాలి.
కార్మికుల పిల్లల విద్య కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు.
వృద్ధాప్యంలో ఉన్న కార్మికులకు పెన్షన్ సదుపాయం,
అసంఘటిత కార్మికుల సమస్యలు కేవలం ఆర్థిక అంశం మాత్రమే కాకుండా, ఇది మానవ హక్కుల సమస్య కూడా అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన జీవనం, సముచిత వేతనం, సురక్షిత పని వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అధికారులు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేసి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాపాడడం ద్వారా సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపించవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.
చివరగా, అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దు.
● జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.



**కరీంనగర్ జిల్లా మార్చి-30 నేటి దర్శిని**
ప్రజావాణి అర్జీలపై విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు.ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కి వస్తారని,ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి.సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే,లక్ష్మి కిరణ్,ఆర్డీవో కే మహేశ్వర్,డి ఆర్ డి ఓ శ్రీధర్,గృహ నిర్మాణశాఖ పిడి శ్రీనివాసు పలు అధికారులు పాల్గొన్నారు.






# స్పిరిట్'లో విలన్‌గా వివేక్ ఒబెరాయ్ సర్ప్రైజ్..

## "పిక్చర్ అభీ బాకీ హై" అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం స్పిరిట్ ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలకమైన విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఒక ప్రెస్ మీట్‌లో వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఆయన తన పాత్ర గురించి చెప్పిన మాటలు ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.ప్రెస్ మీట్‌లో ఒక రిపోర్టర్ ప్రశ్నిస్తూ.. యానిమల్ సినిమాతో బాబీ డియోల్, అలాగే ధురంధర్ చిత్రంతో అక్షయ్ ఖన్నా విలన్లుగా స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చారని గుర్తుచేస్తూ, మీరు కూడా 'స్పిరిట్'తో అలాంటి రీ-ఎంట్రీ ఇస్తారా? అని అడిగారు. దీనికి స్పందించిన వివేక్ ఒబెరాయ్ తనదైన స్టైల్లో బాలీవుడ్ స్టైల్ డైలాగ్‌తో సమాధానం ఇచ్చారు. "పిక్చర్ అభీ బాకీ హై మేరే దోస్త్" అంటూ ఆసక్తికరంగా స్పందించారు. ఇంకా ఈ సినిమా కోసం తాను చాలా కష్టపడాల్సి ఉందని, తన పాత్రకు పూర్తి న్యాయం చేయడానికి డెడికేషన్‌తో పనిచేస్తున్నానని చెప్పారు. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో పాత్రలు ఎంత పవర్‌ఫుల్‌గా, ఇంటెన్స్‌గా ఉంటాయో తెలిసిందే. అలాంటి దర్శకుడి చేతుల్లో తన పాత్ర మరింత బలంగా రూపుదిద్దుకుంటుందని వివేక్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలతో 'స్పిరిట్' సినిమాలో విలన్ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని స్పష్టమవుతోంది.ఇప్పటికే ప్రభాస్ అభిమానులు ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. వివేక్ ఒబెరాయ్ కామెంట్స్‌తో ఈ అంచనాలు మరింత పెరిగాయి. 'స్పిరిట్' బాక్సాఫీస్ వద్ద మరోసారి భారీ రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# అబ్బా అనిపిస్తున్న హెబ్బా నడుమందాలు.

# రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..

## దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి




రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లను ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు. కళ్ళెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# అప్పుడు షారుక్.. ఇప్పుడు సల్మాన్?

సీనియర్ హీరోల పాలిటి కల్పతరువుగా మారింది లేడీ సూపర్‌స్టార్ నయనతార. మొన్న సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు'తో కలిసి సందడి చేసిన ఈ అందాలభామ, ప్రస్తుతం బాలకృష్ణ, మలినేని గోపీచంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమాలో బాలయ్యకు జోడీగా నటిస్తున్నది. త్వరలోనే ఈ సినిమా షూట్‌లో కూడా జాయిన్ కానుంది. ఇదిలావుంటే.. తాజాగా ఈ అగ్రతార మరో ప్రస్టేజియస్ మూవీకి కూడా సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది.సల్మాన్‌ఖాన్ హీరోగా పైడిపల్లి వంశీ దర్శకత్వంలో టాలీవుడ్ నిర్మాత దిల్‌రాజు నిర్మించనున్న బాలీవుడ్ సినిమాలో నయనతార కథానాయికగా ఎంపికైందట. ఇప్పటికే షారుక్‌ఖాన్‌కు జోడీగా 'జవాన్' చిత్రంలో నటించి, బాలీవుడ్‌లో భారీ విజయాన్ని అందుకున్నది నయనతార. ఇప్పుడామె సల్మాన్‌తో జతకట్టనుండటం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం సల్మాన్ 'మాతృభూమి' అనే సినిమా చేస్తున్నారు. అది పూర్తయిన వెంటనే వంశీ పైడిపల్లి ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.

# సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

# ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం

## సంతాపం ప్రకటించిన పవన్



విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365